### ఒలింపిక్ రన్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



బోయిన్‌పల్లిలో ఒలింపిక్ రన్ టీషర్ట్‌లను ప్రారంభిస్తున్నఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,జూన్ 22 ప్రభాతవార్త:** ఒలింక్ రన్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఛీఫ్ ప్యాట్రన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ జింఖానా మైదానం నుంచి ఎల్బీ స్టేడియ వరకు నిర్వహించే ఒలింపిక్ రన్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జెర్సీలను (టీషర్ట్)లను ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ రన్ విజేత మర్రి లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభు కుమార్ గౌడ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

### జిమ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

వ్యాయామం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా మేలు కలుగుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. 4వ వార్డు గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు బోయిన్‌పల్లి మార్కెట్‌లో అన్నదానం

**కంటోన్మెంట్,జూన్ 22 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ వెజ్‌టేబుల్ కమీషన్ ఏజెన్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం ఆదివారం మధ్యాహ్నం బోయిన్‌పల్లి మార్కెట్ ఆవరణలో తలసాని నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బిఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి నివేదిత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, మాజీ సభ్యులు, బిఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

### వికలాంగుడైన తనకు చట్ట ప్రకారం పదోన్నతి కల్పించాలి

**సైఫాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** వికలాంగుడైన తనకు విద్యాశాఖాధికారి నాకు వచ్చిన పదోన్నతిని తొలగించి వేదింపులకు గురిచేస్తున్నదని, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చట్ట ప్రకారం న్యాయం చేయాలని లాలాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గుడి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు, బయాలజీ టీచర్ బూర శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఎస్ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా తాను ఈ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నానని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్న తనకి పది రోజుల క్రితం పదోన్నతి కల్పిస్తూ హైదరాబాద్ జిల్లా శాఖాధికారి రోహిణి వెబ్‌సైట్‌లో తనపేరును పెట్టారని ఆయన తెలిపారు. కాగా నేడు వెబ్‌సైట్ నుంచి తన పేరును తొలగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక సందర్భంగా రోహిణి తనను బెదిరించారని, ఈ విషయంపై తాను కోర్టుకు వెళ్ళడం జరిగిందన్నారు. దీంతో ఆమె తనపై కక్షగట్టి పదోన్నతి లేకుండా చేశారని ఆరోపించారు. కోర్టుల్లో కేసులు ఉన్నప్పటికి పదోన్నతులు కల్పించవచ్చునని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. తక్షణమే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, డైరెక్టర్ దేవసేన, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. త్వరలో వారికి వినతి పత్రాలను సమర్పిస్తానని చెప్పారు.

### కేంద్ర మంత్రికి అభినందనలు తెలిపిన అలేఖ్య



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సన్మానిస్తున్న ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి పి.ఎల్.అలేఖ్య తదితరులు

**అడ్డగుట్ట,జూన్ 22 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీగా బారీ మెజార్టీతో విజయం సాధించడంతో పాటు కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జి.కిషన్ రెడ్డిని బిజెపి ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి పి.ఎల్.అలేఖ్య ప్రతాప్ నీలకంఠం మర్యాదపూర్వంగా ఆయన నివాసంలో కలిసి శాలువకప్పి అభినందనలు తెలియజేశారు.

### కార్యకర్తలకు అండగా ఉంటా : పద్మారావు గౌడ్

**అడ్డగుట్ట,జూన్ 22 ప్రభాతవార్త:** పార్టీలో పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటామని, ఆధుకుంటామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అంజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబానికి మంజూరైన 2 లక్షల బీమా చెక్కును శనివారం అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్,నక్క మధు, మల్లేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలి : కొంతం దీపిక

**అడ్డగుట్ట,జూన్ 22 ప్రభాతవార్త:** చిన్నారుల్లో, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు అంగన్ వాడి టీచర్లపాత్ర ఎంతో కీలకమైందని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. శనివారం మోండా డివిజన్ కుమ్మరిగూడలోని అంగన్ వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు దీపిక చేతుల మీదుగా స్కూల్ యూనిఫారం, నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు సంగీత తదితరులు పాల్గొన్నారు.

### మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేద్దాం

-ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాదిగ



సమావేశంలో పాల్గొన్న ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు

**ముషీరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** జులై 7వ తేదీ వరంగల్‌లో జరుగుతున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేద్దామని ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టి.వి.నరసింహ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లో భారత్ సేవా సమాజ్ నందు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పి ముషీరాబాద్ నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముషీరాబాద్ ఇన్‌ఛార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంకు ముఖ్య అతిధులుగా నరసింహ మాదిగ, ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున మాదిగలు మాట్లాడుతూ మహాజన నేత మందకృష్ణ మదిగ గత 30 సంవత్సరాలుగా షెడ్యూల్ కులాల వర్గీకరణ లక్ష్యసాధనకై అలుపెరుగని పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. అందులో భాగంగా జులై 7న ఎంఆర్‌పీఎస్ 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ కేంద్రంగా జరుగు మాదిగల ఆత్మగౌరవ కవాతును విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు రోషన్ వినాయకరావు మాదిగ, చిలక ఎల్లయ్య మాదిగ, అమ్మగూడెం దశరథ్ మాదిగ, ఇందూరి నరేష్ మాదిగ, పాపిడి రాజు మాదిగ, గురుకు నాగేష్ మాదిగ, మహంకాళి వెంకటయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలను మోసం చేస్తున్న కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు రాంచందర్

**సైఫాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధమని ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ వీలు కాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికి ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇంకా మాదిగ ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఎసి ఛైర్మన్ చెరుకు రాంచందర్ ఆరోపించారు. గడిచిన ఎన్నికల్లో బిజెపికి మద్దతు ఇచ్చిన మంద కృష్ణమాదిగ దళితుల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరాలని, కాలం చెల్లిన వర్గీకరణ అంశాన్ని విడనాడి తన వైఖరి మార్చుకోవాలన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా వర్గీకరణ పేరుతో స్వలాభం కోసం కోట్ల రూపాయల లబ్ధిపొంది మాదిగల ఆత్మగౌరవాన్ని ఆయన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాదాల వద్ద తాకట్టుపెట్టారని, మోదీ కడుపులో తలకాయపెట్టి, కన్నీరు కార్చారని, దళితులను రాజ్యాధికారానికి దూరం చేశారని రాంచందర్ ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బిసిల రిజర్వేషన్‌లు తొలగిస్తామని బిజెపి నాయకులు ప్రకటిస్తే కృష్ణమాదిగ ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. మాలల ఎదుగుదలను చూసి ఓర్వలేక కృష్ణమాదిగ మాలలను విమర్శిస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి మాదిగ ఉపకులం అని చెప్పి ఆయన నుంచి లబ్ధిపొంది, ఎన్నికల్లో కావ్యను విమర్శించడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితు సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు బాలకృష్ణ, ఎస్.నాను, బిట శ్రీనివాస్, దాసరి భాస్కర్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### దేశవ్యాప్తంగా దళితులు బిజెపిని నమ్మలేదు

-మాల ప్రజాసంఘాల జెఏసి ఛైర్మన్ చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య, బూర్గుల వెంకటేశ్వర్లు, మన్నే శ్రీధర్‌రావు తదితరులు

**హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ, లోకసభ ఎన్నికల్లో మాలలపాత్ర మరవలేనిదని, తెలంగాణలో మూడు పార్లమెంట్ రిజర్వ్‌డ్ ఎస్సీ నియోజకవర్గాల్లో బిజెపి పార్టీ ఒక్కసీటు గెలవకుండా మాలమహానాడు కృషి చేసిందని మాల ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ జి.చెన్నయ్య పేర్కొన్నారు. ఈమేరకు శనివారం మాలమహానాడు జాతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దళితులతోపాటు అన్నివర్గాల ప్రజలు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, రాజ్యాంగాన్ని మారుస్తామన్న నేతలను తిరిగి రాజ్యాంగమే మనకి రక్ష అనేలా చేయగలిగామన్నారు. తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా దళితులు బిజెపిని నమ్మలేదని దేశవ్యాప్తంగా రిజర్వుడ్ నియోజకవర్గాల్లో విపక్ష పార్టీలే విజయం సాధించాయని చెన్నయ్య తెలిపారు. ఈసమావేశంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీధర్‌రావు, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు తాలుక రమేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, నాయకులు గోకుల కళ్యాణ్, ఎల్లస్వామి, కమల్ ఆదర్శ్, అనిల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే బిజెపికి పెద్దబలం -కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కిషన్‌రెడ్డికి బుక్స్ అందజేస్తున్న డాక్టర్ హరిచరణ్, పాండురంగయ్య, గోవర్ధన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:** కార్యకర్తలే బిజెపికి అతిపెద్దబలం అని, వారికృషి తెలంగాణ రాష్ట్రంలో పార్టీ విజయానికి పురోగతికి హామీ ఇచ్చిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తనను కలిసి నాయకులను ఉద్దేశించి అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో రెండోసారి మంత్రిపదవి చేపట్టి హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా బర్కత్‌పురాలోని ఆయన నివాసంలో అంబర్‌పేట్ బిజెపి సీనియర్ నాయకులు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ హరిచరణ్, కార్యదర్శి పుట్టా పాండురంగయ్య, నేతలు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, రాజేందర్, విజయేందర్ రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, శాలువవాలతో వచ్చి సన్మానించవద్దని, విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందజేయాలని కిషన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు డాక్టర్ హరిచరణ్ పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి పార్టీని బలోపేతం చేసేందుకు కేంద్ర విధానాలకు మద్దతిచ్చేందుకు కార్యకర్తలు నిర్మాణాత్మక పనితీరు కొనసాగిస్తూ ,ఇంకా పార్టీని మెరుగుపరచుకోవడం లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఐక్యతతో అట్టడుగు స్థాయిలో బిజెపిని అంబర్‌పేట్ నియోజకవర్గంలో బలోపేతం చేయాలని కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఎవరికీ లేని ర్యాంక్ నిబంధన బిసి విద్యార్థులకే ఎందుకు ?

-విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి బిసివిద్యార్థి సంఘం వినతి



బూర వెంకటేశంకు వినతిపత్రం ఇస్తున్న విక్రంగౌడ్, శ్యాంకురుమ, పానుగంటి విజయ్ తదితరులు

**హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:** బిసివిద్యార్థులకు ఇంజనీరింగ్ అడ్మిషన్లలో పదివేల ర్యాంక్ నిబంధన ఎత్తివేయాలని ..ఎవరికీ లేనిర్యాంకు నిబంధన కేవలం బిసి విద్యార్థులకే ఎందుకని బిసివిద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్ బిసి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బూర వెంకటేశంను ప్రశ్నించారు. ఈమేరకు శనివారం ఆయన ఆకార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విక్రంగౌడ్ మాట్లాడుతూ 2008లో నాటి ప్రభుత్వంతో కొట్లాడి ఫీజుల రియంబర్స్‌మెంట్ స్కీం సాధించామన్నారు. బిసిఈలో ఉన్న ముస్లిం,మైనార్టీలకు ర్యాకులతో సంబంధం లేకుండా పూర్తిఫీజులు ఇస్తున్నారని కానీ బిసివిద్యార్థులకు మాత్రం పదివేల ర్యాంకు నిబంధనల పెట్టి మిగిలిన వారికి 35000 వేలు మాత్రమే ఇస్తున్నారని దానివల్ల టాప్‌టెన్ కాలేజస్‌లో బిసవిద్యార్థులకు సీట్లు వచ్చినా అట్టి ఫీజులు లక్ష నుంచి 2లో ఉండటంతో కట్టలేక చదువుకు దూరం అవుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే విద్యార్థులకు ర్యాంకు నిబద్దత ఎత్తివేస్తామని ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల లాగానే బిసివిద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు చెల్లిస్తామని కాంగ్రెస్ మెనిఫెస్టోలో పెట్టారని కాబట్టి పదివేల ర్యాంకు నిబంధన ఎత్తివేసి బిసి విద్యార్థులకు న్యాయం చేయాలని విక్రంగౌడ్ కోరారు. ఈకార్యక్రమంలో యూత్ అధ్యక్షులు శ్యాంకురుమ, దుర్గయ్యగౌడ్, గణేష్‌చారి,ఇంద్రం రజక, పానుగంటి విజ య్, భాస్కర్ మేరు, బిసి విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

### అర్హులందరికి కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులు

-ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్లు బి.పద్మ,

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** అంబర్‌పేట నియోజకవర్గంలో అర్హులందరికి కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ పథకం వర్తింపచేస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు.శనివారం అంబర్‌పేటలోని ఎస్ఆర్‌జి ఫంక్షన్ హాల్‌లో 156 మందికి కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ ఎన్.అమృతలతో కలిసి ఆయన చెక్కులు పంపిణి చేశారు. ఇందులో 99 మందికి కళ్యాణ లక్ష్మీ, 57 మందికి షాది ముబారక్ పథకం కింద చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా అర్హులకు చెక్కులు అందించడం ఆలస్యమైందన్నారు. ఇతర లబ్ధిదారులను గుర్తించి సకాలంలో దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు అందించేలా కృషి చేస్తామన్నారు. పేదవర్గాలు మధ్యవర్తులను నమ్మవద్దని నేరుగా తనను లేదా గోల్నాకలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## వేదాల విశిష్టతపై "ఇంటింటా వేదం " పుస్తకావిష్కరణ

-వేద భారతీ పీఠం పండితుడు గురుచరణ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గురుచరణ్, మల్లేష్‌రెడ్డి, సురేష్ తదితరులు

**హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:** కాశీపుణ్యక్షేత్రంలో నిరంతరాయంగా జరుగుతున్న గంగా హారతి మాదిరిగా గోదావరి పరివాహక ప్రాంతంలో వెలిసిన బాసర పుణ్యక్షేత్రంలో నిత్యగంగా హారతి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నట్లు శ్రీవేద భారతీ పీఠం పండితుడు గురుచరణ్ తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదాల విశిష్టతను వివరిస్తూ వేద విద్యానంద గిరి స్వామి రచించిన "ఇంటింటిటా వేదం "అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా గురుచరణ్ మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం వేదపీఠాన్ని ప్రారంభించి హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.తమ పీఠం ఆధ్వర్యంలో ప్రతిరోజు సాయంత్రం 6గంటలకు పవిత్రగోదావరి నదికి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్తర దిశగా ప్రవహిస్తున్న గంగా నదికి హారతి ఇవ్వడం వల్ల ఏవిధంగా ప్రయోజనం కలుగుతుందో అదేదిశగా ప్రయాణిస్తున్న గోదావరి నదికి హారతి ఇవ్వడం వల్ల కూడా అదే ప్రయోజనం కలుగుతుందన్నారు. హైందవ ధర్మ పరిరక్షణలో పీఠం ఆధ్వర్యంలో కుల, లింగ భేదం లేకుండా అన్నివర్గాల వారికి వేద విద్యను ఉచితంగా బోధిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఆయనతోపాటు మల్లేష్‌రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు మాట్లాడటంకాదు మనిషే మాటలచెట్టు

-తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డి



కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న సిధారెడ్డి, శ్రీరాములు, నాళేశ్వరంశంకరం, సులోచన తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 22 ప్రభాతవార్త :** రచయిత్రి సులోచన ఎంతకాలమైనా, కీర్తివచ్చినా ఇప్పటి వలే విశాలత సహృదయంతో ఉండాలని ఆనుకొంటున్నా, ఆకాంక్షిస్తున్నా, ఉంటావని నమ్ముతున్నానని ఎందుకంటే ఇది మాటలచెట్టని, చెట్టు మాట్లాడుతుందని నేననుకొనడం లేదు...చెట్టును తన కవిత్వానికి ప్రతీకగావాడి మనిషే మాటల చెట్టు అని పెట్టారని, ఇక్కడ కవయిత్రే మాటల చెట్టు అని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డి అన్నారు. చెట్టు మాటలని నిరంతరం పంచుతుందని, చాలా సందర్భాల్లో చెట్టుతో పోలిస్తునే మనిషికి చెబుతారన్నారు. కవుల మనస్సు ఎదుటివారిపట్ల ఆప్యాయత, నిండుగా ఉండాలని, కానీ ఈనాటి రచయితలకు తమంత గొప్పవారు లేరని గర్వం పెరిగిపోయిందని వాపోయారు. ఇదే విషయాన్ని రచయిత్రి ఒక కవితలో ప్రస్తుతించారన్నారు. హృదయ విశాలతతో ప్రేమను పంచపోతే రానురాను ఒంటిరిగా మిగిలిపోతారని, ఇందుకు ఎంతోమంది తార్కాణమని గుర్తుచేశారు. రచయిత్రి సులోచన ఎంత కాలమైనా, కీర్తివచ్చినా సహృదయంతో ఉండాలని అనుకొంటున్నా, ఆకాంక్షిస్తున్నా, ఉంటారనుకొంటున్నానని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర భాషా సాంస్కృతి కశాఖ, తెలంగాణ రచయితల సంఘం, జంటనగరాలు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో కందుకూరి శ్రీరాములు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. నందిని సిధారెడ్డి ఆత్మీయ అతిథులు డా. నాళేశ్వరం శంకరం, డా. ఉదారి నారాయణ, డా. బెల్లంకొండ సంపత్ కుమార్, రచయిత్రి గడ్డం సులోచన, తల్లిదండ్రులు గడ్డం సరోజిని, రంగారెడ్డి తదితరులతో కలిసి గడ్డం సులోచన రచించిన మాటల చెట్టు కవితా సంపుటిని ఆవిష్కరించి రచయిత్రిని ఎంతగానో అభినందించి తొలిప్రతిని ఆమె తల్లిదండ్రులు గడ్డం రంగారెడ్డి, సరోజినిలకు అందజేసి ఘనంగా సత్కరించి అంకితమిచ్చారు.

## కిషన్‌రెడ్డి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలి

**హైదరాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి వ్యక్తి గత జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శవంతం కావాలని బిజెపి ఓబిసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ చెప్పారు. కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయి వరకు ఎంతో కష్టపడి జి.కిషన్‌రెడ్డి ఎదగారని, కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడం బిజెపితోనే సాధ్యమన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తరువాత జి.కిషన్‌రెడ్డి తొలిసారిగా బిజెపి నగర కార్యాలయంకు విచ్చేసిన సందర్భంగా శ్రీధర్ స్వాగతం పలికి సత్కరించి మాట్లాడారు. జి.కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC

క్ర.సం.1. నిట్ నం. 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన నం. 03/EE-I(H)/GHMC/2024-25 తేదీ: .06.2024. పనిపేరు: లిఫ్ట్‌ల యొక్క పాడైన భాగాలు తిరిగి ఏర్పాటు మరియు రీకండిషనింగ్. అంచనా మొత్తం (రూ.లక్షలలో) 54.54, మొత్తం: 03 పనులు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: ప్రారంభ తేదీ : 22.06.2024 సా.4.00గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం : 01.07.2024 మ.3.30గం. అధికారి పేరు, చిరునామా సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I కార్యాలయం (హౌసింగ్) GHMC, 3వ అంతస్తు, మునిసిపల్ బిల్డింగ్, హరిహరకళా భవన్, సికింద్రాబాద్-500003. ఏవైనా విచారణలకు శ్రీ జి.సంధ్యారాణి, AEE (H)/HD, GHMC సెల్ నం.7331189771, ఇ-మెయిల్ id:ee1housinghyd@gmail.com. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ -I (హౌసింగ్), GHMC.

DIPR.No.1029-PP/CL/Advt/1/2024-25 తేదీ: 22.06.2024



**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లైంట్ **బింగి సింధు ప్రియ D/o బింగి సమ్మయ్య W/o శ్రీనివాస్ కొంగ,** వయస్సు సుమారు 34 సంవత్సరాలు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ఇ.నం.9-5-119, విఠల్‌నగర్, గోదావరిఖని, రామగుండం మండలం, పెద్దపల్లి జిల్లా-505208 వారు పురం స్వప్న W/o పురం శ్రీరాములు శ్రీకాంత్ వయస్సు సుమారు 41 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: ప్లాట్ నం.29, వివేకానంద్ కాలనీ, చింతల్‌బజార్, బొల్లారం, సికింద్రాబాద్-500010 వారితో 18.05.2024 తేదీ గల విక్రయ ఒప్పందం చేసుకొన్నారు. విక్రయం-కం-జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ Doc నం.4010 యొక్క 2018 తేదీ: 07.07.2018 ప్రకారం నిధి పువ్వార్ W/o సంతోష్ రుపువ్వార్, వయస్సు సుమారు 41 సంవత్సరాలు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: 4-1-161, ఫ్లాట్ నం.105, నానక్ సాయి రెసిడెన్సీ, హనుమాన్ టెక్డీ నాంపల్లి, హైదరాబాద్ వారికి పురం స్వప్న GHMC హోల్డర్ అయివున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, అల్వాల్ మండలం, అల్వాల్ సర్కిల్ AGPA క్రింద మచ్చ బొల్లారం గ్రామం, "శ్రీ సాయి సూర్య ఎన్‌క్లేవ్" వద్ద ఉన్న బ్లాక్ నం.2, వార్డ్ నం.2, క్రింద కవర్ అయిన 234 చ.గజాలు విస్తీర్ణం, సర్వే నం.164లో ప్లాట్ నం.131 కొనుగోలుకు వల్లభ్‌నగర్ SRO ఎదుట సదరు డాక్యుమెంట్ రిజిస్టర్డ్ అయింది. సరిహద్దులు ఈ విధంగా: ఉత్తరం: పొరుగువారి ఆస్తి, దక్షిణం: ప్లాట్ నం.132, తూర్పు: పొరుగువారి భూమి, పడమర: 30'-0" వెడల్పు రోడ్.

అందువలన ఎవరికైనా వ్యక్తి/లు, ఆర్థిక సంస్థలు పైన పేర్కొనబడిన ఆస్తిపై ఏ రకమైన క్లైమ్, అభ్యంతరాలు, ఆసక్తి లేదా హక్కు ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోపుగా ఈ క్రింది సంతకందారునికి డాక్యుమెంటరీ నిరూపణతోసహా రాతపూర్వకంగా ఇందుమూలముగా తెలియజేయవలసి ఉన్నది. లేని పక్షంలో సదరు ఆస్తి యొక్క విక్రయం లేదా బదిలీ అటువంటి క్లైమ్ లేదా ఆసక్తి మరియు దానినే ఎటువంటి రిఫరెన్స్ లేకుండా పూర్తి చేయబడుతుంది. ఏవైనా ఉన్నా చెల్లుబాటు లేనివిగా పరిగణింపబడతాయి.

సం/- **K. రజని,** న్యాయవాది
ఇ.నం.16-113, ఫ్లాట్ నం.101, సాయి విహార్ రెసిడెన్సీ, కొత్త మిర్యాలగూడ, మల్కాజ్‌గిరి-500047
సెల్ నం: 9393099916/9700022422



**IN THE COURT OF THE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT : AT : SEC'BAD**
**O.S.No. 385 OF 2024**

Between :
**BANDA RAVI @ BANDA RAVINDER REDDY** ...Plaintiff
AND
**The Tahasildar,**
MRO Thirumalagiri,
Secunderabad & Another
...Defendants
To
**All Concerned**
...Defendant No.2

Whereas the above named Plaintiff has filed above suit for declaration of Legal Heirs. You are hereby summoned to appear in this court in person or by a pleader on **12.07.2024 at 10.30** 'O' clock, failing which the matter will be heard and determined in your absence as exparte.

(BY ORDER OF THE COURT)
**M/s. Dr. P. NAGESH**
**P. PUSHPAMALA**
**P. RAJESHWARA RAO**
**B. SHANKER**
**Advocates**
O/o H.No.1-34, 'A' Block, 5-213, Green Gold Apts, Malkajgiri, Hyderabad-47,
**Cell: 9394755591**



**IN THE COURT OF THE HON 'BLE II ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE-CUM-II ADDL. MSJ-CUM- II ADDL. FAMILY COURT MEDCHAL, AT: MEDCHAL**
**O.S. NO. 123 OF 2023**

BETWEEN:
**Mr. Russ Sharma** ...Plaintiffs
A N D
**Mr. Kalali Harishanker Goud and others** ...Defendants
To
1) **K. Venkatesh** S/o. Late Kuppu Swamy, Aged about 63 Years, Occ: Business, R/o. H.No. 12-11-1125, Warasiguda, Secunderabad. T.S.
...Defendant No. 2
2) **Smt. Chukka Padmavathi** W/o. Balraj Goud, Aged about 55 Years, Occ: Business, R/o. B-64, Durgabai Deshmukh Colony, Hyderabad,500067
...Defendant No. 4

WHEREAS the above named Plaintiffshave instituted a suit against both of you for "Declaration and Injunction". You both are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the reliefs sought in the suit on the 30th day of JULY 2024 at 10-30 AM and further you both are hereby directed to file within 30 days of Service of this Summon written statement of your defense and on the said day to produce all documents in your possession or power upon which you base your defense.

TAKE notice that in default of your appearance and to file your written statement within 30 days the suit will be heard and determined in your absence.

By Order of the Court.
**K.S. KUMAR,**
**Advocate**
Date :21 -06-202410-1-626/A, West Marredpally Secunderabad-500026,
**Mobile No. 9966971155**



**IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-II ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR**
**O.P.NO.49 OF 2023**

BETWEEN:
**DUMPAL RAJU** ...PETITIONER
A N D
**K. SRINIVASA RAO And others** ...RESPONDENTS
To
**R-3 M. Raveendranath,** S/o Rama Murthy, Aged about 40 years, Occ: Driver, R/o 8-430C, MM Road, Ongole, Prakasham District. (Driver of Car Bearing No.AP 29 AW 1903)

**NOTICE**

The Petitioner herein had filed the above petition for compensation under Section 166 of the M.V.Act, 1989 and Rule 475/1B of A.P.M.V.Rules, 1989, against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above OP and the matter is posted to **03.07.2024 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
**Sd/- G. RATHNAM REDDY**
**Advocate**
# 11-6-227, Pochamma Bagh, Beside GHMC Office, Saroornagar, Ranga Reddy District
**Cell No.9912658614**



**PUBLIC NOTICE**

It is hereby informed to all the General Public that my client **SMT ROKKAM SAVITHRI,** W/o Rokkam Bheem Reddy had lost Original Registered Sale Deed, Dated 21.07.1984 bearing Document No.7926/1984 in respect of Open Plot No.9, admeasuring 204sq.yds or 170.56sq.mts in Sy.No.259, situated at Turkaymjal Village, Hayathnagar Mandal, Ranga Reddy Districtand bounded on North: Neighbours Land, South: 30 Feet Wide Road, East: Plot No.10 and West: Plot No.8 while she was shifting house from Ragannaguda to B.N.Reddy.

If any person or persons finds the said Original Registered Sale Deed, Dated 21.07.1984 bearing Document No.7926/1984 the same may be handed over to the undersigned as a law abiding citizen. Further, the above said original document shall not be abused or misused or otherwise utilized by unauthorized person. If any unauthorized person makes misuse of it, the same shall not bind my client.

Hence this Public Notice.

**Sd/- SAMALAM NAGARAJU**
**Advocate**
Ibrahimpatnam, Ranga Reddy District
**Cell: 9010208497**



**IN THE COURT OF THE HON'BLE 20th JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**IN**
**O. S. No. 1675 OF 2023**

**Bank of India,**
Sultan Bazar Branch,
Hyderabad ...PLAINTIFF
AND
**1. M/s. CVK Fishers Hyderabad**
Proprietor Mr.C. Vikrath Kumar
Regd office H.No.1-7-941,
Ramnagar, Musheerabad
Hyderabad- 500020
**2. Mr. C. Vikrath Kumar**
H.No.1-7-941, Ramnagar,
Musheerabad Hyderabad-500020 ...DEFENDANTS

**PUBLICATION IN VAARTHA NEWS PAPER**

Please take notice that the above suit is filed for recovery of moneytowards loan advanced. The summons sent to your address were returned unserved. You are hereby called upon to appear in the court either personally or through Advocate on **10.07.2024 at 10.30 a.m** and file your objections if any. In default the matter will be decided ex-parte according to Law.

By order of court
**K. INDIRA**
**Advocate**
**Cell.No.9492630859**



**IN THE COURT OF THE HON'BLE 20th JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**IN**
**O. S. No. 1676 OF 2023**

**Bank of India,** Sultan Bazar Branch, Hyderabad ...PLAINTIFF
AND
**1. M/s. Renuka Yellamma Wines,** Prop. P. Anjappa, H. No. 1-66, Bantwaram (Vill & Mandal) Vikarabad District Telangana State - 501106.
**2. Mr. P. Anjappa** S/o Ramulu 5-13/2, Baswapur, Bantwaram, Tumamidi, KV Ranga Reddy, Telangana State - 501142
**3. M/s Lakshmi Narsimha Wines** Pro. Mr. T. Ramesh, H.No.8-73, Gundaram (PS) Karimnagar District, Telangana - 505528
**4. M/s Raja Rajeshwara Wines Bejjanki,** Pro. Bandaram Uma, H.NO.14-155/5/A, Tulasi Nagar, Near Little Star High School, Allapur, Balanagar, Moosapet, Ranga Reddy, Telangana - 500018
...DEFENDANTS

**PUBLICATION IN VAARTHA NEWS PAPER**

Please take notice that the above suit is filed for recovery of money-towards loan advanced. The summons sent to your address were returned unserved. You are hereby called upon to appear in the court either personally or through Advocate on **10.07.2024 at 10.30 a.m** and file your objections if any. In default the matter will be decided ex-parte according to Law.

By order of court
**K. INDIRA**
**Advocate**
**Cell.No.9492630859**



**PUBLIC NOTICE**
**IN THE COURT OF THE II ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURTS:: AT: HYDERABAD**
**O.S.No. 238 of 2024**

Between:
**Munagala Sudhakar Rao & 6 others** ...Plaintiffs
And
**1. The Tahsildar,** Saidabad Mandal, Hyderabad District.
**2. All Concerned** ...Defendants
To
**All concerned**

Please take notice that the Plaintiffs filed the suit for seeking the relief of declaring them as the legal heirs and successors to their deceased father late Munugala @ MungalaSampath Rao and in turn successors to the suit schedule property bearing Municipal No. 17-1-B/106 (MIGH No.106/B), admeasuring 396.32 Sq.yds situated at Old Santhoshnagar Colony, Saidabad Mandal, Hyderabad and the above case stands posted on **19-07-2024.** If anyone is having any objection whatsoever in respect of the above suit claim of the Plaintiffs, they may appear before this Hon'ble Court on the above date either in person or through your Counsel at 10:30 A.M and take necessary stand, failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE HON"BLE COURT//
**M/s. P. VIJAYASARADHI**
**M. RAVI KIRAN REDDY**
**Advocates**
#6-3-248/K/G2, Abhishek Residency, Banjara Hills, Hyderabad.
**Mob: 9440260885**



**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా మా క్లైంట్ పేరొందిన ఒక చిన్నతరహా ఫైనాన్స్ బ్యాంకర్గా, మహేందర్‌కర్ రాజేష్ S/o M. రమేష్, వయస్సు సుమారు 39 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇ.నం. 22-5-98/19, రథ్‌ఖానా, చార్మినార్, హైదరాబాద్ వారిచే ప్రాతినిధ్యం గల M/s. రాజేష్ ఫ్యాన్సీ జ్యుయల్లర్స్‌కు రుణం మంజూరు చేయడానికి నిర్ణయించారు. నా క్లైంట్‌ను వారు, కృష్ణవేణి W/o N. నరసింహ్ నుండి గోల్గొండ SRO ఎదుట రిజిస్టరై మరియు 22.11.2011 తేదీ గల సేల్ డీడ్ Doc. నం.3914/2011 ద్వారా కొనుగోలు చేయడం కారణంగా క్రింద పేర్కొనబడిన ఆ ఆస్తి యొక్క షెడ్యూల్ యజమానిగా క్లైమ్‌తో రుణానికి సమీపించారు. ఒరిజినల్ సేల్ డీడ్ Doc. నం. 3914/2011 తేదీ 22.11.2011 పోగొట్టుకోవడంతో ఆస్తి యజమాని మహేందర్‌కర్ రాజేష్, రుణానికి సెక్యూరిటీగా ఒక రిజిస్టర్డ్ గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ లేదా వారి భార్య పేరిట ఏ ఇతర రిజిస్టర్డ్ డాక్యుమెంట్ లేదా ఏ ఇతర కుటుంబ సభ్యుడు/లు పేరిట రుణానికి సెక్యూరిటీగా డిపాజిట్ అమలు చేస్తారు.

ఏ వ్యక్తి/లు, ఆర్థిక సంస్థలు/బ్యాంకులు సదరు ఆస్తి యొక్క షెడ్యూల్‌కు సంబంధించి హక్కు, టైటిల్, అభ్యంతరాలు లేదా క్లైమ్‌లు కలిగి ఉన్నట్లయితే ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోపుగా వారి క్లైమ్‌లను క్రింది సంతకందారునికి డాక్యుమెంటరీ నిరూపణలతోసహా దాఖలు చేయవలెను మరియు ఆ తర్వాత ఎటువంటి క్లైమ్‌లు పరిగణించబడవు.

**ఆస్తి యొక్క షెడ్యూల్:** హైదరాబాద్, ఇబ్బల్‌గంజ్, పురానాపూల్ వద్ద ఉన్న 150 చ.గజాలలో 100 చ.గజాలు లేదా సమానమైన 83.61 చ.మీటర్లు విస్తీర్ణం గల 28/1 సర్వే నం.లోని మునిసిపల్ నం.13-3-603/3 కలిగి ఉన్న (ఫ్లాట్ నం.8) ఇంటి యొక్క పోర్షన్ మొత్తం అదంతా. సరిహద్దులు ఈ విధంగా: **సరిహద్దులు: ఉత్తరం:** ఇ.నం. 13-3-603/D, **దక్షిణం:** విక్రేత యొక్క ఇల్లు మరియు ఇ.నం.13-3-603/3/1, **తూర్పు:** 20' అడుగుల వెడల్పు రోడ్, **పడమర:** పొరుగువారి ఇల్లు నం.13-3-603/2/A/D.

సం/- **డా॥ C.S. చక్రవర్తి,** న్యాయవాది
(గ్రౌండ్ ఫ్లోర్, ఇ.నం.16-11-16/T/4, "మాస్టర్స్ నిలయం", వెస్ట్ ప్రశాంత్ నగర్, ముసారాంబాగ్, హైదరాబాద్-500 036.

## మీర్‌పేట్‌లో టికెఆర్ ఉమెన్స్ క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ కాలేజీ క్యాంపస్ గ్రౌండ్స్‌లో టికెఆర్ ఉమెన్స్ టి 20 క్రికెట్ ఛాంపియన్ షిప్-2024 పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన కాలేజీ గ్రౌండ్స్‌లో ప్రతిష్టాత్మకంగా ఉమెన్స్ టి 20 పోటీలను నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ పోటీల విజయవంతానికి కాలేజీ యాజమాన్యం సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. క్రికెట్ పోటీల నిర్వాహకుడు అక్కి ఈశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ మహిళల క్రికెట్‌కు రోజు రోజుకీ ఆదరణ పెరుగుతున్నదని అన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి మహిళా క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిగిరింత దయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్‌ను నిషేధించాలని ముఖ్యమంత్రికి వినతి



సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌతమ్ రెడ్డి, నిషికాంత్ రెడ్డి

**సైదాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గూడూరు గౌతమ్ రెడ్డి, ఎలిమినేటి నిషికాంత్‌రెడ్డిలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్ వలలో చిక్కి యువతతో పాటు అనేక మంది తీవ్రంగా నష్ట పోతున్నారని వీటిని వెంటనే రాష్ట్రంలో నిషేధించాలని ముఖ్యమంత్రిని కోరారు. తాము చేసిన విన్నపానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

## కాలనీలలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం : ప్రేమ్‌కుమార్



కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, జూన్ 22 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీలో కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలలో వాటర్ ప్రెజర్ రావడంలేదని ప్రెజర్ వచ్చేలా చూడాలని కోరారు. దీంతో అధికారులతో కలిసి కార్పొరేటర్ వాటర్ మీటర్లను పరిశీలించారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ అధికారులకు సూచించి వాటర్ ప్రెజర్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్, వాటర్ మీటర్ పరిశీలకులు వినయ్‌కుమార్, సైట్ ఇంచార్జ్ ప్రణయ్, కాలనీవాసులు రుక్మిణి, సరస్వతి, లక్ష్మి, భాస్కర్, కిషోర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లవి అంతర్జాతీయ స్కూల్లో ఘనంగా నూతన విద్యార్థి నాయకుల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన విద్యార్థులతో స్కూల్ టీచర్లు, ఇన్స్‌పెక్టర్ కిషన్ సింగ్

**నాచారం, జున్ 22 ప్రభాతవార్త :** విద్యార్థి జీవితంలోనే నేతలుగా ఎదిగి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని పల్లవి విద్యాసంస్థలఅధ్యక్షుడు మల్కా కొమురయ్య, ఇన్స్‌పెక్టర్ కిషన్ సింగ్ పేర్కొన్నారు. పల్లవి అంతర్జాతీయ స్కూల్లో నూతన నాయకుల ఎన్నికల వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇన్‌స్పెక్టర్ కిషన్‌సింగ్, విద్యా సంస ్థల అధ్యక్షులు మల్కా కొమురయ్య నూతనంగా ఎన్నికైన విద్యార్థులను అభినందించి బ్యాడ్జీలను తొడిగి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సీఓఓ అండ్ డైరెక్టర్ యశస్వీ మల్కా, ప్రధానోపాధ్యాయులు హేమ మదబుషి, ఉపప్రధానోపాధ్యాయురాలు మీన, సీసిఏ ఇంచార్జి ప్రియాంక మాథూర్‌తో పాటు పలువురు విద్యార్థులు, వారి పేరెంట్స్ పాల్గొన్నారు.

## వెంకటరమణ కాలనీలో నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు : కార్పొరేటర్ రాగుల



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూన్ 22 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ వెంకటరమణ కాలనీలలో నూతనంగా వేస్తున్న సిసి రోడ్లను కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా వేస్తున్న సిసి రోడ్లను నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రజలకు, కాలనీ వాసులకు తొందరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార యక్రమంలో కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అవుట్ పోస్టులో సిబ్బందిని నియమించాలి : కార్పొరేటర్ బన్నాల గీత



ఎసిపి చక్రపాణికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గీతప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జూన్ 22 ప్రభాతవార్త :** చిలుకానగర్ చౌరస్తాలో ఉన్న పోలీస్ అవుట్ పోస్టులో సిబ్బందిని నియమించాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలుకానగర్ చౌరస్తాలో అవుట్‌పోస్టులో సిబ్బంది లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, ప్రతి రోజు ఇద్దరు కానిస్టేబుల్స్, సెక్టార్ ఎస్ఐ ఉండేవిధంగా చూడాలని కోరారు. అదే విధంగా ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుందని, ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై పోలీసులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కార్యదర్శి కె.జగన్, బింగి శ్రీనివాస్, రామాంజనేయులు, జెమ్స్ రాజు, నాగయ్య, పీటర్‌పాల్, రవీందర్‌గౌడ్, బాలేందర్, నర్సింగ్, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పత్రికను ఆవిష్కరిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

**ఎల్.బి.నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ లలితనగర్‌కాలనీలోని శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి దేవాలయం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరిగే దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం దేవాలయం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. చాముండేశ్వరి గురుదత్తపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరన్‌శర్మ ప్రత్యక్ష పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23వ తేదీ ఆదివారం సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, పుణ్యాహవాచనం, రక్షా బంధనం,అంకురార్పణ, ధ్వజపటాధివాసం, తదితర కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24వ తేదీన మూలమంత్ర హోమం, శేషవాహనము, 25వ తేదీన గరుడవాహనసేవ, 26వ తేదీన శ్రీ రమా సహితశ్రీవీరవెంకటసత్యనారాయణస్వామివారి కళ్యాణమహోత్సవం, 27వ తేదీన స్వామివారి వ్రతం, అన్నప్రసాద వితరణ, అశ్వవాహన సేవ, 28వ తేదీన ప్రధాన కుంభారాధన, మహాపూర్ణాహుతి, 108 కళాశాలతో అభిషేకం, తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా గరుడఇష్టి, సుదర్శనఇష్టి, లక్ష్మీనారాయణఇష్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహాగుప్త, వైస్‌చైర్మన్ పాల్తి శ్రీనివాస్, కోశాధికారి మార్గం రమేష్, సభ్యులు బచ్చు సత్యనారాయణ, వక్కలంక శ్రీనివాసరావు, సి.కుమారస్వామి పాల్గొన్నారు.

## చాదర్‌ఘాట్‌లో ముమ్మరంగా పోలీస్ పెట్రోలింగ్



చాదర్‌ఘాట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**మలక్‌పేట, జూన్ 22 ప్రభాతవార్త :** చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్‌లో పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా పాతనగరంలో జరుగుతున్న సంఘటనలతో శాంతిభద్రతల పర్యవేక్షణకోసం చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వస్తువులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ఎస్.ఆర్ డిజి పాఠశాలలో ఎర్త్ డే వేడుకలు

**నేరెడ్‌మెట్, జూన్ 22 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఎస్.ఆర్. డిజి పాఠశాల ప్రిన్సిపల్ అన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు శనివారం పాఠశాలలో ఎర్త్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తమవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరు మొక్కను తీసుకువచ్చి పాఠశాల ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమిని రక్షించడం కొరకు ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతకు మొక్కను నాటాలన్నారు. నీటిని సంరక్షించి, కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. నేడు ప్రజలు పూర్తిగా ప్లాస్టిక్ మాయలో పడి కాలుష్యానికి నాంది పలుకుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వోదయనగర్‌లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

**సరూర్‌నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని సర్వోదయ నగర్ కాలనీలోనున్న సత్యసాయి సేవా మందిరంలో చైత్రమాస పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు భక్తి శ్రద్ధలతో వ్రతాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరిరావు, మీర్‌పేట్ సమితి కార్యనిర్వాహకులు శివానందం, కృష్ణమూర్తి, రామ్మోహన్‌రావు, ఎర్రయ్య, అశోక్, రామకృష్ణలతో పాటు సాయి భక్తులు దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ బదిలీ

**సరూర్‌నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న కాశీ విశ్వనాథ్ బదిలీ అయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. అయితే రాచకొండ పోలీస్ కమీషనర్ చేసిన బదిలీల్లో భాగంగా ఆయన బదిలీ అయ్యారు. కాగా కాశీ విశ్వనాథ్ ఎక్కడికి బదిలీ అయ్యింది కమీషనర్ ఉత్తర్వుల్లో ప్రకటించలేదు. అయితే ఆయన స్థానంలో యాదాద్రి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తూ రోడ్ సేఫ్టీ విభాగానికి అటాచ్ అయి ఉన్న కె.నాగరాజును నియమించారు. ఈ మేరకు రాచకొండ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేస్తున్నా ఎమ్మెల్యే బీఎల్ఆర్, శాంతిశేఖర్

**నాచారం, జూన్ 22 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలోని కార్తికేయనగర్ వీధి నెం.9, 10లో రూ. 40లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తికేయనగర్‌లో మిగిలిన పనులను త్వరలో మంజూరు చేయిస్తానని హామినిచ్చారు. డివిజన్‌లో సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలను తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాప్రా సర్కిల్ డిఈ రూప, ఏఈ లింగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటి ఎన్నిక



కాలనీ అసోసియేషన్ కొత్త కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న సంఘం నేతలు

**ఉప్పల్, జూన్ 22 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ ఆదర్శనగర్‌లోని వెంకటేశ్వరకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటిని శనివారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటి అధ్యక్షునిగా యాసోజు నరసింహాచారి, ఉపాధ్యక్షులుగా మార్కపురం పీరయ్య, రాచకట్ల సురేష్, గజిబీమ్‌కార్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా మేడిగ శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా దుద్యాల వెంకటేష, గంగిశెట్టి అనిల్, దుబ్బాని సంజీవ, కంచె అనిల్, తెల్కల శ్రీనివాస్‌రెడ్డి, కాలేరు ఉపేందర్, చెన్నోజు రామాచారి, కోశాధికారిగా ఇల్లందుల సురేందర్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా గొడల మహేందర్‌యాదవ్, ఏదుగాని బాలకృష్ణ, ఏడోజు కుమారస్వామి, మంచికంటి రాములు, సలహాదారులుగా కందాల వెంకటాచారి, కప్పల వెంకటేష్‌గౌడ్, బండ నల్లారెడ్డి, కర్ల మధుసూధన్‌రెడ్డి, దరావత్ శ్రీనివాసారావు, కప్పల లింగమయ్యగౌడ్, సంకోజు బ్రహ్మచారిలు ఎన్నికైనట్లు కాలనీ అధ్యక్షుడు యాసోజు నరసింహాచారి తెలిపారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్త కమిటి నేతలను ఘనంగా సత్కరించారు.

## పేద బ్రాహ్మణ విదేశీ విద్యా బాధిత విద్యార్థులను ఆదుకోవాలని పోస్ట్ కార్డు ఉద్యమం



ముఖ్యమంత్రి పోస్ట్ కార్డు పంపుతున్న నాయకులు

**ఎల్.బి.నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** పేద బ్రాహ్మణ విదేశీ విద్య బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర తెలంగాణ బ్రాహ్మణ సేవ సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడిచేర్ల నాగేశ్వర సిద్ధాంతి విజ్ఞప్తి చేశారు. వక్కలంక శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో శనివారం పోస్టకార్డ్స్ ఉద్యమాన్ని నాగేశ్వర సిద్ధాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని సంఘల వాళ్ళు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి బ్రాహ్మణుడు ఒక పోస్టకార్డును పంపించాలని కోరారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో వివేకానంద విదేశీవిద్యా పథకం ద్వారా మంజూరైన ఉత్తర్వులతో ఒక వాయిదా ద్వారా విద్యార్థులకు పంపడం అక్కడ విద్యార్థులు జాయిన్ అయిన తర్వాత వాయిదాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులు పరిష్కరించాలని పోస్ట్ కార్డ్స్ ఉద్యమం చేపట్టామన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో హైదరాబాద్‌లో అన్ని సంఘాల వారితో పోస్టకార్డ్స్ ఉద్యమాన్ని మొదలపెడతామని, ఎంతో విశ్వాసంతో మా నాయకులుగా ఎన్నుకున్నామని, బ్రాహ్మణులు సమాజహితం కోరుకునేవారని, పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీశక్తీ అనురాధ, నాగరాజ్, అన్నంభోట్ల పవన్, రఘునందన్ పాల్గొన్నారు.

## హబ్సిగూడలో కార్పొరేటర్ చేతన పర్యటన

**ఉప్పల్, జూన్ 22 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం కార్పొరేటర్ కక్కిరేణి చేతన పలువురు అధికారులతో కలిసి పర్యటించారు. హబ్సిగూడ వీధి నెం.1లోని సుప్రభాత్ హోటల్ పక్క వీధిలోని కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్యం, వెటర్నరీ సమస్యలు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పలు సమస్యలు పరిశీలించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎఇ అసిఫ్‌అలీ, శానిటేషన్ డిఇ చందన, ఎఇ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : అబ్రార్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, జూన్ 22 ప్రభాతవార్త :** అజంపుర డివిజన్‌లో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని మూసానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి పనులను జిహెచ్ఎంసి, జలమండలి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ అజంపుర డివిజన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలను రూపొందించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్స్‌పెక్టర్లు మహేష్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

**ఉప్పల్, జూన్ 22 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అత్యుల ఆర్ట్స్ అకాడమీ లక్ష్మీదుర్గ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మూషిక వాహన, బ్రహ్మాంజలి, మహాగణపతి, ఇదిగో భద్రాది, ముద్దుగారే యశోధ, పలుకే బంగారమయేనా, జతిస్వరం, ఒకపకికొకపరి, నమశ్శివాయతేయ్, జనుత శబ్దం, శృంగారలహరి తదితర అంశాలను కళాకారులు లాస్య, ప్రణవి, సోనాలిక, అద్య, వేరోనికా, వేదం, శాన్వి, తనూజ, ప్రవల్లి, దన్వి, అబిజ్ఞ తదితరులు తమ ప్రదర్శనలతో మెప్పించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## కాలనీలలో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌కు కాలనీవాసుల విజ్ఞప్తి



కాలనీవాసులతో కలిసి సమస్యలను తెలుసుకుంటున్న లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూన్ 22 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ చైతన్య నగర్‌కాలనీ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని కోరారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీలలో పర్యటించిన సమస్యలు, అభివృద్ధి పనుల గురించి కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని రోడ్ల శుభ్రపర్చాలని, వెంటనే సమస్య పరిష్కారం కావాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా కాలనీలలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పవన్‌రెడ్డి, ఏఈ నరేందర్ తేజ, వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, జిహెచ్ఎంసి ఎస్ఎస్ అర్జున్ ఉద్దీన్ జవాన్, రాంచందర్, వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : బద్దం

**ఎల్.బి.నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** డివిజన్లో సమస్యలు పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీనగర్‌కాలనీలో సానిటేషన్ అధికారులతో కలిసి శనివారం కార్పొరేటర్ పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. పారిశుద్ధ కార్మికులు సక్రమంగా రోడ్లు శుభ్రం చేయడం లేదని, కాలనీలో రోడ్లపై చెత్త పేరుకుపోతుందని, మంచినీటి పైప్‌లైన్ సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ సదుపాయం లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ కాలనీవాసులు అనారోగ్యబారిన పడే ప్రమాదం ఏర్పడుతుందని కాలనీవాసులు వివరించారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ పటిష్టమైన ప్రణాళికతో దశలవారీగా కాలనీ సమస్యలన్నిటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య విభాగం సూపర్వైజర్ బుచ్చయ్య, జవాన్ యాదగిరి, శ్రీనగర్‌కాలనీ వాసులు బ్రహ్మచారి, శ్రీనివాస్, కీర్తి కాంత్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నివారణ కొరకు స్పెషల్ డ్రైవ్ : శ్రావణ్



జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ శ్రావణ్..

**నేరెడ్‌మెట్, జూన్ 22 ప్రభాతవార్త :** మల్కాజిగిరి డివిజన్‌ను చెత్తరహిత డివిజన్‌గా తీర్చి దిద్దుతానని కార్పొరేటర్ శ్రావణ్ పేర్కొన్నారు. శనివారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మున్సిపల్ అధికారులతో కలసి పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ నగరాన్ని చెత్త సేకరణ, నిర్వహణలో ఆదర్శంగా తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో మల్కాజిగిరి డివిజన్‌ను నమూనాగా తీసుకొని పది రోజుల కార్యాచరణ చేపట్టడం జరిగిందన్నారు. రానున్న పది రోజుల్లో ప్రతి రోడ్డులో ప్రత్యేక ప్రణాళికతో చెత్త సేకరించడానికి అదనపు సిబ్బందిని పెట్టాలని, చెత్త కుప్పలు (జి.వి.పి) లేకుండా చేయడం కోసం సంబంధిత అధికారులు అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు. ఉదయం, సాయంత్రం రెండు సమయాల్లో చెత్త సేకరణ చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శానిటైజేషన్ అదనపు కమీషనర్ ఉపేందర్ రెడ్డి, డి.ఇ మాధవి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ శ్రీకోదండరామ్ నగర్‌లోని శ్రీఅలివేలు మంగా సమేతశ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బిచ్చినపల్లి లక్ష్మీనరసింహారావు, ప్రధానకార్యదర్శి గంధం వెంకటేశ్వర్లు, కోశాధికారి నరసింహం, సభ్యులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, పాల్తి శ్రీనివాసరావు, ప్రభాకర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎల్ అపార్ట్‌మెంట్‌లో సౌకర్యాలు కల్పించాలని అపార్ట్‌మెంట్‌వాసుల ధర్నా

**ఉప్పల్, జూన్ 22 ప్రభాతవార్త :** ఉప్పల్ క్రికెట్ స్టేడియం ముందు ఉన్న ఎన్ఎస్ఎల్ అపార్ట్‌మెంట్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ పలువురు అపార్ట్‌మెంట్‌వాసులు శనివారం ఎన్ఎస్ఎల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసిన తమ ప్లాట్‌కు కనీస సదుపాయాలు కల్పించాలని, మంచినీరు,బోరు నీరు కలిసి వస్తుందన్నారు. విద్యుత్ బిల్లులు కమర్షియల్ బిల్లులు వసూలు చేస్తున్నారని, నిబంధనల ప్రకారం తమకు ఎన్ఓసిలు ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల క్రితం తాను కొనుగోలు చేసిన ఈ ప్లాట్‌లలో సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మొత్తం 920 ప్లాట్‌లు ఉండగా, ప్రస్తుతం 460 ప్లాట్‌లలో ఇళ్లలోకి వచ్చినట్లు తెలిపారు. దీనిపై ఎన్ఎస్ఎల్ యజమాన్యం దృష్టికి తీసుకుని రాగా వారి నుంచి స్పందన లేదని, త్వరలోనే భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.